నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను నెలాఖరులోగా పూర్తిగా పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించిన అభ్యర్థులకు క్రమబద్ధీకరణ మంజూరు పత్రాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా వస్తున్న నూతన లేఔట్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత గల దరఖాస్తుల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామన్నారు. 2020 ఆగస్టు 26 వరకు 10 శాతం ప్లాట్లు విక్రయించిన లే ఔట్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ వినియోగదారులకు ఉగాది కానుక

- వచ్చే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ
- జిల్లాలో 2.19 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- 3,200 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రేషన్ వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుడుతోంది. ఈ నెల 30 ఉగాది పండుగ రోజున సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అన్ని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. అందులో భాగంగా జిల్లాలోని 2,19,637 రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు 6 కిలోల చొప్పున 3,200 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ నెలా ఖరు వరకు జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథ నిలో గల పౌరసరఫరాల శాఖ ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి అన్ని రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేయనున్నారు.

● నెరవేరనున్న ఎన్నికల హామీ

ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని హామీ ఇవ్వడమే గాకుండా మేనిఫెస్టోలో కూడా పేర్కొన్నారు. ఆ మేరకు ప్రభుత్వం సన్న బియ్యం సేకరించేందుకు రాష్ట్రంలో గడిచిన వానా కాలం సీజన్‌లో సన్న రకం వరి ధాన్యం సాగును ప్రభుత్వం ప్రోత్సహించింది. సన్న రకం వరి పంటను పండించే రైతులకు క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీంతో

(మిగతా 8వ పేజీలో)

● పక్కదారి పడుతున్న దొడ్డు బియ్యం

రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న దొడ్డు రకం బియ్యం చాలా వరకు పక్కదారి పడుతున్నాయి. ఆ బియ్యాన్ని కేవలం 40 శాతం మంది ప్రజలే తింటుండగా, మిగతా వినియోగదారులు రేషన్ డీలర్లకు 10 నుంచి 12 రూపా యలకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. మరికొందరు వ్యాపారులు, సంచార జాతులకు చెందిన వారికి కిలో 12 నుంచి 15 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం అటు, ఇటు తిరిగి రీసైక్లింగ్ అయి రేషన్ షాపు లకే చేరుకుంటున్నాయి. మరికొంత మంది పెద్ద ఎత్తున మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసు కుంటున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సంబంధిత శాఖాధికారులు ఎన్ని కేసులు పెట్టినా, ఎంత నిఘా పెట్టినా అక్రమ దందాకు అడ్డుకట్ట పడ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కడుపు నింపేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ రైస్ ఇచ్చినా వాటిని తినేందుకు మెజారిటీ ప్రజలు ఇష్ట పడడం లేదు. సన్న బియ్యం ఇస్తేనే అందరు వినియోగ దారులు సద్వినియోగం చేసుకుంటారని భావించిన కాంగ్రెస్ పార్టీ రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామని ప్రక టించింది. ఆ మేరకు వచ్చే నెల నుంచి శ్రీకారం చుడుతున్నది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం
రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్



రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

అంతర్గాం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే రైల్వే సంస్థ ప్రధాన లక్ష్యమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం రామగుండం రైల్వే స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన జీఎంకు స్థానిక రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అమృత్ భారత్‌లో భాగంగా రూ.26కోట్లతో చేపట్టిన రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన పార్కింగ్, ప్రయాణికులు వేచి ఉండే గదులు, ఎస్కాలేటర్, ఫ్లాట్ ఫాంలు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్మిక సమస్యలు విన్నవించిన మజ్దూర్ యూనియన్ సంఘ్ నాయకులు జీఎంను సన్మానించారు. డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్, ఏరియా ఆఫీసర్ రజినేష్ కుమార్ మీనా, ఏఈఎన్ బీఎంకే గుప్తా, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్, స్టేషన్ మాస్టర్ మీనా, ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్, జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్, యూనియన్ నాయకులు యాదగిరి స్వామి, వీరన్న, రాథోడ్ ఆనంద్, విజయ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం
99.87శాతం మంది విద్యార్థులు హాజరు



పెద్దపల్లి పరీక్ష కేంద్రాలవద్ద బారులుదీరిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 7వేల 388మంది విద్యార్థులు హాజరు కానుండగా 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. జిల్లాలో మొదటిరోజు తెలుగు పేపర్ పరీక్ష జరుగగా 3ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 15సెంటర్లను, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 3సెంటర్లను, జిల్లా విద్యాశాఖ అధికారి 6పరీక్ష కేంద్రాలను సందర్శించారు. మొదటి రోజు పరీక్షకు 7388మంది విద్యార్థులు హాజరయ్యారు. 9మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 99.87 శాతం హాజరు శాతానికి చేరుకుంది. రామగిరి మండలం వాణి హైస్కూల్‌ను అదనపు కలెక్టర్ డి.వేణు తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీసులు, కాపీ జరగలేదని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వెంట అధికారులు పాల్గొన్నారు.



ధర్మారంలో కురుస్తున్న వర్షం



పెద్దపల్లిలో కురుస్తున్న వర్షం

జిల్లాలో అకాల వర్షం..



హన్మంతునిపేటలో కురిసిన వడగండ్లు

పెద్దపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడుకున్న వర్షం కురిసింది. పెద్దపల్లి, ఎలిగేడు, జూలపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం, రామగుండం ప్రాంతాల్లో వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. పెద్దపల్లి పట్టణంలో 4.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కొన్ని చోట్ల ఈదురుగాలులతో మామిడి కాయలు నేలరాలాయి. వరి పంట ఇప్పుడిప్పుడే కంకులు వేస్తోంది. అకాల వర్షాలు, వడగళ్ల వర్షాలపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. (మిగతా 8వ పేజీలో)

రెవెన్యూ సమస్యలపై నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

పెద్దపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 5 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ డి వేణు, ఆర్డీవోలు, సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాలలో ఉన్న ప్రభుత్వ భూముల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌యూపీ కార్యక్రమంలో జరిగిన పొరపాట్ల సవరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కింద జిల్లా మండల స్థాయిలలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. భూ వివాదాలపై ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓలు సురేష్, బి గంగయ్య, ఏఓ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరిండెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మారు పేరు సమస్యను పరిష్కరించండి
ముఖ్యమంత్రిని కోరిన రామగుండం ఎమ్మెల్యే



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారు పేర్ల సమస్యలతో డిపెండెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన మారు పేర్లతో విజిలెన్స్ పెండింగ్‌లో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. త్వరలోనే మారు పేర్ల సమస్యలను పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్టు చెప్పారు.

ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే లక్ష్యం



సమీక్ష సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యమని సీపీ అంబర్ కిశోర్ ఝా చెప్పారు. శుక్రవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం కమిషరేట్ పరిధిలో ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై నమ్మకం, భరోసా కలగాలన్నారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని, నివారణ మార్గాలకు కృషి చేయాలన్నారు. రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని, రహదారులపై అవసరమైన చోట వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు, కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, జంక్షన్ల వద్ద పాదచారులు రోడ్డు దాటే వద్ద జీబ్రా క్రాసింగ్, ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రతీ విషయం తెలుసుకోవాలన్నారు. రోడ్లపై విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, సీసీ కెమెరాలు, చైన్ స్నాచింగ్, గంజాయి, రాబరీ, ఇతర అక్రమ రవాణాలను అరికట్టాలని, డ్యూటీ సమయంలో సిబ్బంది, అధికారులు స్వీయ రక్షణ పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని జాతీయ రహదారి 63, ఎన్‌హెచ్-363, రాష్ట్ర రహదారులు ఎస్‌హెచ్-1, ఎస్‌హెచ్-24, ఎస్‌హెచ్-8తో పాటు ఇతర రోడ్లపై 2022 నుంచి 2024 వరకు జరిగిన ప్రమాదాల గురించి తెలుసుకున్నారు. అడిషన్ డీసీపీ (అడ్మిన్)రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్ర రావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం పని చేసే ప్రభుత్వం మాది
- అసెంబ్లీలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సొమ్మును నీళ్ల పాలు చేసే ప్రభుత్వం కాదని, రైతుల కోసం పని చేసే ప్రభుత్వమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. తొమ్మిదిన్నర బీఆర్‌ఎస్ పాలన తీరుపై ధ్వజమెత్తారు. లక్ష కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినప్పటికీ రైతులకు సద్వినియోగం కాలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద రెండు పిల్లర్లు కుంగాయని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు వచ్చాయన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల బృందం సూచనల మేరకు మూడు బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడం లేదన్నారు. అయినా ఎస్సారెస్పీ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 5.50 లక్షల ఎకరాలకు సాగు నీరందుతున్నద న్నారు. ఎల్‌ఎండీ ద్వారా సూర్యాపేటకు నీళ్లు పోతున్నాయని అన్నారు. తమది రైతుల సొమ్మును నీళ్ల పాలు చేసే ప్రభుత్వం కాదని విమర్శిం చారు. ఉప ఎన్నికలు వచ్చినప్పుడే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ నియోజక వర్గంలో కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో కొన్ని పనులు చేశారే తప్ప రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలనే సంకల్పంతో గతంలో మీ సేవా కేంద్రాల వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, ప్రస్తుతం మీ సేవా కేంద్రాల ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నదని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సన్న బియ్యం ఇచ్చేందుకు సన్నద్ధం అవుతున్నదని విజయ రమణారావు అన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు
యువకుడి బలి
- అప్పులపాలై ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

6



సాయితేజ (ఫైల్)

వీడియో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు

● వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవస్థానం లోని దర్గాకు తాళం వేస్తున్నట్లు వస్తున్న వీడియో గతానికి సంబంధించినదని వేములవాడ పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు. కొంతమంది ఈ మధ్యే జరిగింది అంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని, ఆ వీడియో అవాస్తవమన్నారు. గతంలో జరిగిన సన్నివేశాన్ని ప్రస్తుతం జరిగినట్టుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలు సోషల్ మీడియా వేదికగా వచ్చే అవాస్తవాలు నమ్మవద్దని తెలిపారు.

తప్పిపోయిన వృద్ధురాలు



సావనపల్లి లక్ష్మి

కరీంనగర్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొరెం గ్రామానికి చెందిన వృద్ధురాలు సావనపల్లి లక్ష్మి (70) తప్పిపోయిందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ అధికారి వసుంధర యాదవ్ ప్రకటనలో తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వృద్ధురాలు లక్ష్మి తన కూతురుతో కలిసి శుక్రవారం చింతకుంటకు బయలేర్దింది. చింతకుంటలో ముందుగా కూతురు బస్సు దిగింది. తన వెంటే లక్ష్మి దిగిందనుకుంది. తిరిగి చూసే సరికి కనిపించలేదు. బస్సులోనే ఉన్న లక్ష్మి బస్టాండ్ లేదా ఇందిరాచౌక్ వద్ద దిగి ఉంటుందని భావించి వెంటనే రెండుచోట్ల వెతికింది. ఆచూకీ లభ్యం కాలేదు. లక్ష్మి నలుపు రంగు, గుండ్రని ముఖం కలిగి ఉంటుంది. గులాబీ రంగు చీర, నీలం రంగు జాకెట్ ధరించి ఉంది. ఆచూకీ లభిస్తే కొత్తపల్లి పోలీస్ స్టేషన్ నంబరు 9494490268, 8712670765లో సమాచారం అందించాలని స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ అధికారి తెలిపారు.

రైతులకు సౌరశక్తి

● ఏఐ అనుసంధానంతో సలహాలు, సూచనలు

● సిరిసిల్లలో ప్రణాళిక రూపకల్పనకు జర్మనీ బృందం పరిశీలన



సిరిసిల్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) పరిధిలోని రైతులకు ఏఐ అనుసంధానంతో సలహాలు, సూచనలు అందించడంతో పాటు రైతులకు సౌరశక్తిని కూడా అందించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తామని జర్మనీ బృందం తెలిపింది. జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యవసాయ సహకార సంస్థ ఐఏకే అగ్రార్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ స్వేన్ గెల్హార్ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సంస్థ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టిన్, రెబెవా, మార్టిన్, రఘుల బృందం శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సెస్ సంస్థను సందర్శించింది. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్లతో బృందం భేటీ అయ్యింది.

సిరిసిల్లలోని 220 కేవీ విద్యుత్ స్టేషన్‌ను పరిశీలించారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, రామన్నపేట, శ్రీరాములపల్లె గ్రామాల్లో వ్యవసాయ సాగుతీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల సెస్ పరిధిలో సోలార్‌హబ్‌గా మార్చే దిశగా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. గత సంవత్సరం వేములవాడ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ రమేష్‌బాబు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావులు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రణాళికలపై చర్చించామన్నారు. మంత్రిని కూడా కలిశామని పేర్కొన్నారు.

సోలార్‌శక్తితో పాటు రైతులకు ఏఐ కృత్రిమ మేధాశక్తి ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వడం, వాతావరణానికి అనుకూలంగా సాగు చేసే విధానాలపై ఖరీఫ్ రబీలో పరిశోధనలు చేశామని, త్వరలోనే సేవలు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్మనీ బృందాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ విజయేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, సుధాకర్, వరుస కృష్ణహరి, గౌరినేని నారాయణరావు, అంజిరెడ్డి, రవీందర్‌రెడ్డిలు సన్మానించారు.



సిరిసిల్ల పెద్దూర్ సబ్ స్టేషన్‌ను, మామిడిపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

అక్రాట్ ప్రాజెక్టు సాంకేతిక పనులను పరిశీలించిన జర్మనీ బృందం

కోనరావుపేట : అక్రాట్ ప్రాజెక్టు సాంకేతిక పనులను ఇండో-జర్మనీ అగ్రికల్చర్ యూనివర్సిటీ బృందం సభ్యులు పరిశీలించారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, మంగళపల్లి, రామన్న పేట శ్రీరాములపల్లె గ్రామాల్లో ఇండో జర్మనీ ప్రాజెక్టు, అగ్రికల్చర్ యూనివర్సిటీ బృందం శుక్ర వారం వ్యవసాయ పొలాలను సందర్శించారు. అక్రాట్ ప్రాజెక్టు కింద రైతులు ఆమోదిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పొందడం, సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా రైతులు పొందుతున్న లాభాలను సమీక్షించారు. ఫెడరల్ మంత్రిత్వశాఖ ఆసియా విభాగం ప్రధానిగా పనిచేస్తున్న రిబెక్కా రిడ్డర్ మాట్లాడుతూ రైతులు, స్టార్టప్స్, శాస్త్రవేత్తలు, బ్యాంకుల మధ్య ఉన్న సమన్వయం కీలకంగా ఉందన్నారు. ఈ బృందంలో పీజేటీఏయూ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ బాలరామ్, అగ్‌హబ్ సీఈవో విజయ్ నడిమింటి, అక్రాట్ ప్రాజెక్టు మేనేజర్ ముకేశ్ రామగోని, ఎస్‌ఈడబ్ల్యూఎస్ నుంచి కృష్ణ, నాబార్డ్ కరీంనగర్ డీడీఎం జయప్రకాష్, దిలీప్, పీజేటీఏయూ శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీవో ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో పడుకున్న ప్రయాణికుడి బ్యాగులో నుంచి డబ్బులు దొంగతనం చేసిన కేసులో ఒకరికి ఐదు నెలల పదిరోజుల జైలు శిక్షతోపాటు 50 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు మొదటి అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జితేందర్ శుక్ర వారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలోని కోనవల్లి గ్రామానికి చెందిన కల గంగారాం అనే వ్యక్తి 2024 అక్టోబరు 29నజగిత్యాల జిల్లా కేంద్రానికి వైద్యం కోసం వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్లగా అర్ధరాత్రి కావడంతో అక్కడే నిద్రించాడు. గుర్తుతెలియని వ్యక్తి గంగారాం నిద్రిస్తున్న సమయంలో తన బ్యాగులో ఉన్న 18,300 రూపాయలను చోరీ చేశాడు. గమనించిన బాధితుడు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మన్మధ రావు కేసు నమోదు చేసి సీసీ పుటేజీల ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తిని మహారాష్ట్రలోని గోపాలపట్నం తాలుకా భద్రకాళి గ్రామానికిచెందిన కొమరం సతీష్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టుడ్యూటీ అధికారి రాజేశ్వర్‌రావు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో సతీష్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు

● రూ.30 వేల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు. వరివద్ద నుంచి రూ.30వేలనగదుతో పాటు 7సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

స్వీట్ షాపుల తనిఖీ

కోల్‌సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి ఆధ్వర్యంలో స్వీట్ షాపులను తనిఖీ నిర్వహించారు. నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న ఒక బేకరీ, స్వీటు షాపునకు రూ.20వేల జరిమానా విధించారు. మరో బేకరీలో నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనంచేసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా స్వీట్లు తయారుచేసినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో శానిటరీఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌మధుకర్, ఎంఐఎస్‌ఆపరేటర్‌శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్ గ్రామంలో పీడీఎస్ బియ్యాన్ని ఎస్సై గణేశ్ పట్టుకున్నారు. శుక్రవారం నామాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనంపై పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న అనరాసి మల్లయ్యను పట్టుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ఇఫ్తార్ విందు ఏర్పాట్ల కోసం వెళ్లి పరలోకానికి

● లారీ ఢీకొని తండ్రీ, కొడుకు దుర్మరణం



షేక్ అజీమ్, అబ్దుల్ రెహ్మాన్ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలో ఇఫ్తార్ విందు ఏర్పాట్లు చేసి మక్త గ్రామానికి తిరిగి వెళ్తుండగా కేశవపట్నం బస్టాండ్ సమీపంలో లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తండ్రీ, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్త గ్రామానికి చెందిన షేక్‌అజీమ్(35), అతనికుమారుడు అబ్దుల్‌రెహ్మాన్ (10) ద్విచక్రవాహనంపై కేశవపట్నం నుంచి మక్తకు వెళ్తున్నారు. కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తండ్రి, కొడుకు ఇద్దరు అక్కడి కక్కడే మృతిచెందారు. వీరితోపాటు రోడ్డుపక్కన బైక్‌పై వెళ్తున్న మాందాడి శ్రీనివాస్‌రెడ్డికి తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌జీ, రూరల్ సీఐ పులి వెంకట్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఎస్ఐ రవిని అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సైదాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొత్తలపల్లి గ్రామంవద్ద జరిగిన శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మర్రి సదయ్య(47) సైదాపూర్ నుంచి గొల్లగూడెంకు వెళ్తున్నాడు. బొత్తలపల్లి మూలమలుపు వద్ద హుజూరాబాద్‌కు చెందిన ఓ స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న సదయ్యను ఢీకొట్టింది. దీంతో సదయ్యకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సదయ్య మృతిచెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో లంబ శ్రీనివాస్ అనేయువకుడు పురుగులమందుతాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటనమండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు అతడిని మండల కేంద్రంలోని ఓప్రైవేటుఆసుపత్రికి తరలించారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనంమేరకు.. శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతడిభార్య సవితతో కొంతకాలంగా గొడవలు చోటుచేసుకుంటున్నాయి. రెండురోజుల కిందట శ్రీనివాస్ పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలోఉన్న అతడిని మండలకేంద్రంలోని ఓప్రైవేటుఆసుపత్రికి తరలించారు. అతడిపరిస్థితి విషమంగా ఉంది. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం



అరవింద్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో శుక్రవారం ఓ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వాసాల అరవింద్ (21) కరీంనగర్‌జిల్లా ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈనెల19న స్నేహితులతో కలిసి ఎల్ఎండీలోని ఎస్సారెస్పీ కెనాల్‌వద్దకు ఈతకోసం వెళ్లి గల్లం తైనట్లు ఎల్ఎండీ పోలీసులు తెలిపారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. లభ్యమైన మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ మోటార్ల దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌మోటర్ల దొంగలను అరెస్టుచేసి ఆరు విద్యుత్‌మోటర్లను స్వాధీనం చేసుకున్నట్లు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన ఎండీ ఆఫ్రోజ్, బిజిలి శ్రీను, కంపెల్లి అనిల్ జల్సాలకు అలవాటుపడి డబ్బు సంపాదించడానికి అందరూ కలిసి విద్యుత్‌మోటర్లు ఎత్తుకెళ్లిఅమ్ముకొని డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు తనిఖీచేయగా ఆరు కరెంట్ మోటర్లు దొంగలించడానికి ఉపయోగించిన మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకొని ఏ-1గా ఎండీఅఫ్రోజ్, ఏ-2 బిజిలి శ్రీను, ఏ-3గా కంపెల్లి అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐవెంకట్, ఎస్ఐరవి తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుబడిన ద్విచక్రవాహనం, గుడుంబాతో పోలీసులు

ముస్తాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్రాపూర్, సేవాలాల్‌తండాల్లో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులునిర్వహించారు. దాదాపు100కిలోల బెల్లాన్ని, 10లీటర్ల గుడుంబా, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనపరుచుకున్నారు. బెల్లం విక్రయాలు జరుగుతుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

గంభీరావుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 9వ వార్డులో మహిళలు తాగునీటి సమస్యపై ఖాళీబిందెలతో శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ పరిధిలోని బోరు చెడిపోయి తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. మిషన్‌భగీరథ నీరు రోజూరావడం లేదని, దీంతో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. పలుసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమారం పేట గ్రామానికి చెందిన పోరెడ్డిఆనందరెడ్డి, అంచే సంతోష్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా అల్లీపూర్ గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు గాయపడగా సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

మాజీమావోయిస్టు హుస్సేన్‌కు బెయిల్ మంజూరు

జమ్మికుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీ మాజీసభ్యుడు, సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) వ్యవస్థాపకుల్లో ఒకరైన మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్‌కు శుక్రవారం బెయిల్ మంజూరు అయింది. 2024జులై 8నజమ్మికుంటలో తెల్లవారుజామున మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్ పోలీస్‌లు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మరో రెండు కేసులు నమోదయ్యాయి. బెయిల్ మంజూరు కావడంతో శనివారం జైలు నుంచి ఆయన బయటకు రానున్నారు.

స్వగ్రామం చేరిన యువకుడి మృతదేహం

హుజూరాబాద్‌రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పుల్ల సృజన్(33) థాయ్‌లాండ్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందగా శుక్ర వారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. పుల్ల సృజన్ తాను పనిచేస్తున్న ఏషియన్ కంపెనీ తరుపున థాయ్‌లాండ్‌కు విహారయాత్ర వెళ్లాడు. జనవరి 25న సృజన్ రోడ్డుప్రమాదంలో గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహం గ్రామానికి రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. శనివారం అంత్యక్రియలు జరగనున్నాయి.

నిండు ప్రాణం బలిగొన్న బెట్టింగ్ యాప్

● లక్షల్లో నష్టపోయి యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్న యువకుడు బెట్టింగ్ యాప్ మాయలోపడ్డాడు. లక్షల రూపాయలు యాప్‌లో పెట్టి నష్టపోవడంతో మానసికంగా కుంగిపోయిన ఆ యువకుడు బలవర్మణానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే మంథని మండలం విలోచవరంకు చెందిన కొరవేన సాయితేజ(26) గోదావరిఖనిలోని ప్రైవేట్‌ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. సాయితేజ ఈనెల18న సింగిరెడ్డిపల్లె శివారులో గడ్డిమందు తాగాడు. తాను ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితుడైన మోటం సాయితేజకు ఫోన్‌చేసి చెప్పాడు. హుటాహుటిన మోటం సాయితేజ సింగిరెడ్డిపల్లె చేరుకోగా అప్పటికే కొరవేన సాయితేజ అపస్మారకస్థితిలో కనిపించాడు. గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొరవేన సాయితేజ గురువారం రాత్రి మృతిచెందాడు. సాయితేజ మృతికి బెట్టింగ్ యాప్ కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాదిగా బెట్టింగ్ యాప్‌లు వాడుతున్న సాయితేజ లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం అప్పుల పాలవడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడంతో మానసికంగా కుంగిపోయాడు.

ఆరేళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్న సాయితేజకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

వడగండ్ల వర్షం.. పంటలకు నష్టం



చందుర్తిలో నేలవారిన వరి పంట

చందుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంతోపాటు లింగంపేట, కట్టలింగంపేట, తదితర గ్రామాల్లో శుక్రవారంసాయంత్రం వడగండ్ల వర్షంకురిసింది. చందుర్తి,లింగంపేట గ్రామాల్లో పొట్టదశకు వచ్చిన వరిపంటతోపాటు ఇతరపంటలు దెబ్బతిన్నాయి. మల్యాల కట్టలింగంపేటగ్రామంలో స్వల్పంగా వడగండ్ల వర్షం కురవడంతో కొద్దిపాటి పంటకు నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. చందుర్తి-మల్యాల గ్రామాల మధ్య కొరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలో ఈదురుగాలులకు చెట్లువిరిగిపడడంతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య సిబ్బందితో కలిసి విరిగిపడినకొమ్మలను తొలగించారు. పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

జగిత్యాల అర్బన్/గొల్లపల్లి/జగిత్యాల రూరల్/ధర్మపురి/మల్యాల/కొడిమ్యాల/సారంగాపూర్/బీర్‌పూర్: జగిత్యాల జిల్లాలోని జగిత్యాల పట్టణం, జగిత్యాల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కొడిమ్యాల, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. జగిత్యాల పట్టణం రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పలు మండలాల్లో మామిడి కాయలు నేలరాలగా, పొట్టదశకు వచ్చిన వరి, నువ్వుల పంట, మొక్కజొన్న నేలవాలింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడిమ్యాల మండలంలోని కోనాపూర్‌లో ఓ తాటి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి.

కోనరావుపేట: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన పడింది. మండలంలోని భూక్య రెడ్డి, అజ్మీర తండాల్లో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. కానీ పంటలకు ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో మండల రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడినవర్షం శుక్రవారం కురిసింది. పంటలు ఎండిపోతున్న దశలో కురిసిన వర్షం వల్ల వరి వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామడుగు: మండలంలో ముఖ్యంగా హైబ్రిడ్ వరిసాగు చేసిన రైతులు ఇబ్బంది పడుతుండగా, కోతకు వచ్చిన వరిరైతుల గుండెల్లో రైళ్లు పరుగె డుతున్నాయి. మరో మూడు రోజులపాటు వర్షం కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబు తున్న నేపథ్యంలో రైతులు గగ్గోలు పెడు తున్నారు. సాగునీరు లేక ఎండిపో తున్న పంటలకు కొంత ఊరటనిస్తున్నప్పటికీ మిగతా రైతులకు కునుకు లేకుండా చేసే అవకాశం ఉంది. కాగా సాధారణ వర్షం కురిస్తే పెద్దనష్టం లేనప్పటికీ ఉరుములు, మెరుపు లతో కూడిన వడగళ్ల వర్షం కురిస్తే పెద్ద మొత్తంలో నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

చొప్పదండి: చొప్పదండిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వ్యవసాయమార్కెట్‌లో రైతులు తీసుకువచ్చిన మక్కలు తడిసిపోయాయి. మక్కలను రైతులు ఆరబోయగా, సాయంత్రం కురిసిన వర్షానికి టార్పాలిన్లు కప్పేలోగానే వర్షానికి తడిచిపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేసిన మక్కలు సైతం తడిసిపోయాయి. మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్ మార్కెట్‌ను సందర్శించారు. కాగా తడిసిన మక్కలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మక్కల బస్తాలు



కొడిమ్యాల: తాటి చెట్టుపై చెలరేగిన మంటలు



కోనరావుపేట: అజ్మీర తండాలో కురుస్తున్న వడగళ్ల వాన

ప్రమాదకరంగా చేపలవేట

విద్యుత్ వినియోగించి ప్రమాదాలు

సరదా కోసం వెళ్లి ప్రాణాలమీదకు

ఎల్లారెడ్డిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో చేపలు పడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల గ్రామాల్లో సరదాగా చేపలవేట కొనసాగుతోంది. భారీ వర్షాలకు చెరువులు, వాగుల్లో నీరు ఉండటంతో చేపలు పట్టేందుకు కొందరు వ్యక్తులు రాత్రిపూట వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. విద్యుత్తు షాక్ పెట్టి చేపలు పడుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో రెండేళ్ల కాలంలో చేపల వేటకు వెళ్లి పది మంది మృతి చెందారు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన నారాయణపూర్‌లోని భవన నిర్మాణ కార్మికుడు కమటం ఉదయ్‌కిరణ్ సమీప మానేరు వాగులో చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.

ఈ నెల 19న మానేరు వాగులో ఉదయ్‌కిరణ్ శవమై కనిపించాడు. ఈత రాకపోవడం వల్ల నీటి లోతు తెలియక నీట మునిగి చనిపోయాడు. గతంలోనూ సింగారంలోని వ్యక్తి బొమ్మాడి నారాయణ గ్రామ శివారులోని మానేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. విద్యుత్తు షాక్ పెట్టి చేపలు పడుతున్న క్రమంలో విద్యుదాఘా తంతో నీటిలోనే మృతి చెందాడు. గతంలోనూనారాయణపూర్, కోరుట్లపేట, బొప్పా పూర్ గ్రామాల్లో చేపలను వేటాడేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో పాటు నీట మునిగి చనిపోయారు. రెండేళ్లలో పది మంది చేపల వేటకు వెళ్లి చనిపోయారు.

చేపల వేటకు విద్యుత్ వినియోగిస్తే కేసులు

రమాకాంత్, ఎస్ఐ, ఎల్లారెడ్డిపేట

చేపలు పట్టడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈత రాని వ్యక్తులు చేపల వేటకు వెళ్లకూడదు. విద్యుత్‌షాక్ పెట్టి చేపలను వేటాడుతున్న వారిపై కేసులు నమోదు చేశాం. నీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చూస్తాం. గ్రామాల్లో చేపలు పట్టే వారికి అవగాహన కల్పించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

అంజన్నను దర్శించుకున్న న్యాయాధికారి



ఆలయంలో కుటుంబ సభ్యులతో న్యాయాధికారి

మల్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి జూనియర్ అసిస్టెంట్ సివిల్ న్యాయమూర్తి కవిత శుక్రవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వారి వెంట ఆలయ అధికారులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు.

దేశ సేవకు తరలిరండి

- అగ్నివీర్‌ల నియామకానికి నోటిఫికేషన్ జారీ
- ఏప్రిల్ 10 వరకు దరఖాస్తు గడువు
- ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హత

చొప్పదండి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని ఉందా.. ఇప్పుడో అవకాశం వచ్చింది. దేశవ్యాప్తంగా అగ్నివీర్ నియామకాలకు ప్రకటన విడుదలైంది. కొన్ని ఉద్యోగాలకు ఎనిమిదో తరగతి విద్యార్హతతోనూ పోటీ పడవచ్చు. పరీక్ష, ఫిజికల్ టెస్టులతో నియామకాలుంటాయి. అవకాశం వచ్చినవారు శిక్షణతో కలిసి నాలుగేళ్లు ఆర్మీలో సేవలు అందించవచ్చు. ఆ తర్వాత వీరిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. మిగిలిన వారికి ఆర్థిక ప్రోత్సాహకం, స్కిల్ సర్టిఫికెట్లను అందజేస్తారు. తెలంగాణ అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో పరీక్షలు, ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు. ముందు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభావంతులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు. తాజా నోటిఫికేషన్ ద్వారా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేశారు.





పరీక్ష ఇలా...

దరఖాస్తు చేసుకున్న పోస్టు ప్రకారం ప్రశ్నపత్రం ఉంటుంది. ఎక్కువ విభాగాలకు జనరల్‌నాలెడ్జ్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్ విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. కొన్ని పోస్టులకు కంప్యూటర్ సైన్స్, జనరల్ ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, ఫిజిక్స్, మ్యాథ్స్ కెమిస్ట్రీల్లోనూ ప్రశ్నలుంటాయి. పరీక్ష కోసం తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. 50 ప్రశ్నలను గంటలో పూర్తిచేయాలి. కొన్ని పోస్టులకు 100 ప్రశ్నలు, 2 గంటల వ్యవధితో పరీక్ష ఉంటుంది. ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో ప్రాక్టీస్ టెస్ట్ అందుబాటులో ఉంది. క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టులకు టైప్ పరీక్ష అదనం. నిమిషానికి 30 ఆంగ్ల పదాలు టైప్ చేయగలగాలి.

ఫిజికల్ టెస్టులు...

అన్ని పోస్టులకూ ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. ఇందులో భాగంగా 1.6 కిలోమీటర్ల దూరాన్ని 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకన్ల నుంచి ఐదు నిమిషాల 45 సెకన్లలోపు పూర్తిచేస్తే 48 మార్కులు ఇస్తారు. ఆరు నిమిషాల్లోపు చేరుకుంటే 36 మార్కులు, ఆరు నిమిషాల 15 సెకన్ల లోపు అయితే 24 మార్కులు పొందుతారు. కనీసం ఆరు పుల్ అప్స్ తప్పనిసరి. ఆరు తీసిన వారికి 16, ఏడు తీస్తే 21, 8కి 27, 9కి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. తొమ్మిది అడుగుల దూరానికి దూక గలిగితే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, అడాప్టబిలిటీ, మెడికల్ టెస్టులు ఉంటాయి. వీటన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

వేతనం, సేవానిధి...

మొదటి సంవత్సరం ప్రతి నెలా 30 వేల రూపాయలు, రెండో ఏడాది 33 వేల రూపాయలు, మూడో సంవత్సరం 36,500 రూపాయలు, నాలుగో ఏటా 40 వేల రూపాయలు చెల్లిస్తారు. ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. నాలుగేళ్ల వ్యవధికిగాను సేవానిధిలో 5.02 లక్షలు అగ్నివీరుడి వేతనం నుంచి పోగవు తుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. రెండూ కలిపి 10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీ జత చేసి అగ్నివీరుడికి అందిస్తారు.

ఆర్మీ ఉద్యోగంలోకి...

నాలుగేళ్ల వ్యవధి పూర్తిచేసుకున్న అగ్నివీరుల ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని ఆర్మీలో శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం ఆర్మీ అవసరాలు, నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైనవారు 15 ఏళ్ల విధుల్లో కొనసాగవచ్చు.

అగ్నివీర్ జనరల్ డ్యూటీ...

పదో తరగతిలో కనీసం 45 శాతం మార్కులు అవసరం. ప్రతి సబ్జెక్టులో 33 శాతం మార్కులు పొందాలి. లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి డ్రైవర్ పోస్టుల్లో ప్రాధాన్యనిమిస్తారు. ఎత్తు 168 సెంటీమీటర్లు ఉండాలి.

అగ్నివీర్ టెక్నికల్

మ్యాథ్స్, పిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. ప్రతి సబ్జెక్టులో 40 శాతం, మొత్తం మీద 50 శాతం మార్కులు పొందాలి. లేదా పదో తరగతిలో ప్రతి సబ్జెక్టులో 40 శాతం, మొత్తం మీద 50 శాతం మార్కులుండాలి. నిర్దేశిత ట్రేడ్/బ్రాంచీల్లో రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎత్తు 165 సె.మీ. ఉండాలి.

అగ్నివీర్ క్లర్క్ స్టోర్ కీపర్ టెక్నికల్

ఏ గ్రూపులోనైనా ఇంటర్‌లో 60 శాతం మార్కులు పొందిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్, మ్యాథ్స్/అకౌంట్స్/ బుక్ కీపింగ్‌లో 50 శాతం తప్పనిసరి. ఎత్తు 162 సె.మీ. ఉండాలి.

అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్...

ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైతే చాలు. ప్రతి సబ్జెక్టులో 33 శాతం మార్కులు ఉండాలి. ఎత్తు 166 సెంటీమీటర్లు ఉండాలి.

వయస్సు...

అన్ని పోస్టులకూ కనిష్ఠంగా 17 సంవత్సరాల ఆరు నెలలు, గరిష్ఠంగా 21 ఏళ్లలోపు వయస్సు ఉండాలి. అక్టోబరు 1, 2004 - ఏప్రిల్ 1, 2008 మధ్య జన్మించినవారు అర్హులు. అన్ని పోస్టులకు ఎత్తుకు తగ్గ బరువు అవసరం. చాతీ విస్తీర్ణం 77 సెంటీమీటర్లు ఉండాలి. సర్వీస్‌మెన్, ఎక్స్ సర్వీస్‌మెన్, వార్ విడో పిల్లలకు మినహాయింపులు వర్తిస్తాయి.

బోనస్ మార్కులు...

- ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు 20 ఉంటాయి.
- క్రీడల్లో రాణించినవారికి స్థాయినిబట్టి గరిష్ఠంగా 20 మార్కులు కేటాయించారు.
- ఎన్‌సీసీ ఎ ఉంటే 5, బీతో 10, సీ ఉంటే 20, సీతోపాటు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటే గరిష్ఠంగా 25 మార్కులు దక్కుతాయి.
- పది తర్వాత రెండేళ్ల ఐటీఐకి 20, రెండు లేదా మూడేళ్ల డిప్లొమాకు 50 మార్కులు.
- ఇంటర్ తర్వాత ఏడాది ఐటీకి 30, రెండేళ్లకైతే 40 మార్కులు.
- ఇంటర్ తర్వాత డిప్లొమా చేస్తే 50 మార్కులు.
- ఈ బోనస్ మార్కులు గరిష్ఠంగా టెక్నికల్ పోస్టులైతే 50, మిగిలిన వాటికి 25 కలుపు తారు. వీటిని పరీక్షల్లో సాధించిన మార్కులకు జతచేసి మెరిట్ లిస్టు రూపొందిస్తారు. అర్హులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు.



వర్తించేవి...

వార్షిక సెలవులు 30 ఉంటాయి. ఆరోగ్య సమస్యనుబట్టి సిక్ లీవ్ కేటాయిస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌లో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు మాత్రం అందిస్తారు. నాలుగేళ్ల పాటు 48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవ లకుగాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందుతుంది. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. పింఛన్, గ్రాట్యూటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గాను పరిగణించరు. కరువు భత్యం, మిలిటరీ సర్వీస్ పే(ఎంఎస్‌పి), ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఉండదు. అగ్నివీరులు నాలుగేళ్లలోపే కావాలంటే వైదొలగవచ్చు. అలాంటి సందర్భంలో అగ్నివీరుడి వేతనం నుంచి జమ అయిన మొత్తాన్నే చేతికి అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం దక్కదు.

దరఖాస్తు వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10

ఫీజు: 250 రూపాయలు

ఆన్‌లైన్ పరీక్షలు: జూన్‌లో

వెబ్‌సైట్: joinindiaarmy.nic.in

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే కుట్ర

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుట్రలో భాగంగానే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చిందని, దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వానికి గండి కొట్టే విధంగా లౌకిక వ్యవస్థకు భంగం కలిగించేందుకు రాజ్యాంగాన్ని మార్చాలనుకునే బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు.

బీజేపీ పాలనలో నరేంద్రమోదీ దేశాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నా రని ఆరోపించారు. నల్లడబ్బు వెనక్కి తెస్తామని ప్రజలను నమ్మించారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పిస్తామని హామీలు ఇచ్చి విస్మరించారని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన ఆత్మ గౌరవం కాకుండా ఆత్మవంచనగా సాగిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బడ్జెట్‌ను అంకెలకే పరిమితం చేయకుండా అమలు పరిచే దిశగా ముందుకెళ్లాలన్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి అవకాశాల కోసం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అవుట్‌సోర్సింగ్, చిరుద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు రాక పోవడం శోచనీయమన్నారు.

ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వే షన్ హర్షనీయమని అన్నారు. వేసవిలో తాగునీటి కష్టాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎండిపోతున్న పంటలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య పాల్గొన్నారు.

కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన జీఎం



స్టేషన్ పరిసరాలను తనిఖీ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

కరీంనగర్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వేస్టేషన్ ఆధునికీ కరణ పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శుక్రవారం పరిశీలించారు. కొత్తగా నిర్మించిన రెండో అదనపు ప్లాట్ ఫాంతోపాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కాలేటర్, అదనపు గదులు వంటి పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు పనుల పురగోతిపై వివరించారు. మిగతావి త్వరలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఆర్ఎం అంబరీష్ కుమార్ జైన్, స్టేషన్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిలిపివేయాలి

ఎస్‌యూ ఎదుట ఎస్ఎఫ్ఐ నిరసన

గణేశ్‌నగర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిలిపివేయాలని, ఉస్మానియా యూనివర్సిటీ వద్ద ఆంక్షలు ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, నిరసనలు చేయరాదని ఉస్మానియా యూనివర్సిటీ ఆంక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం భూముల ను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడం నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ భూములను పెట్టుబడిదారులకు అమ్ముకుంటూ పోతే రాష్ట్రానికి ఏమీ మిగలదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి పట్టించుకోకుండా ఆస్తులను లాక్కోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశపాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దాడి మహేష్, భాష, వసంత్, దీక్షిత్, మల్లేష్, ప్రవీణ్, ప్రేమ్, శ్రీహరి, దత్తు, వంశీ, భార్గవి పాల్గొన్నారు.



శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

స్వయం సమృద్ధి సాధనే వికసిత్ భారత్ లక్ష్యం

ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ కే రామకృష్ణ

గణేశ్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్వయం సమృద్ధి సాధనే వికసిత భారత్ లక్ష్యమని, దీనికి కర్షకులు, కార్మికులు పారిశ్రామికవేత్తలు, యువత, విద్యార్థులు సమష్టిగా కృషి చేసి 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చేయాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ కే రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సారార్ కళాశాల కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల రెండు రోజుల వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలు భారతదేశంలో ఎన్నికల నిర్వహణ ఖర్చులను తగ్గించడంతో పాటు అధికారుల పని భారాన్ని తగ్గించి ఓటింగ్ శాతాన్ని పెంచుతాయన్నారు. విశిష్ట అతిథి డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కడారు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల సృజనాత్మక శక్తులను వెలికితీయాలన్నారు. వికసిత్ భారత్ రెండు జిల్లాల నోడల్ సమన్వయకర్త ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనగా 10 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన కుమారి శ్రీనిత్య మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనడం, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని దీని వెనుక అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు. మరో విజేత కుమారి స్వర్ణలత మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కూడా విజేతగా నిలిచి ప్రధాని మోదీ ముందు తన గళాన్ని వినిపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ రిసోర్స్ పర్సన్ సంతోష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి. రాజయ్య , అటానమస్ కోఆర్డినేటర్ వంగళ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్న ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిప్రాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జేఎన్టీయూలో యువ ఉత్సవ్



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రామగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం ఎర్రన్న, సింగరేణి రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యధిక యువత కల్గిన దేశం భారత దేశమని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, యోగా అంశాలలో పాల్గొనాలని తెలి పారు. యువత క్రమశిక్షణ అలవర్చుకొని ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఉత్తమ పౌరులుగా దేశానికి ఉపయోగపడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు ఎంపీడీవో శైలజారాణి బహుమతులు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం వలంటీర్‌లు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం



వేంకటేశ్వర స్వామి వారల ఏకాంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి స్వామి వారల ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఏకాంతోత్సవం నిర్వహించారు. అనేక మంది భక్తులు దర్శనం చేసుకుని ఉత్సవాన్ని తిలకించారు. కొత్త (ఉగ్ర) నరసింహస్వామి వారల పుష్పయాగం కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారల పల్లకి సేవ ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కాగా వర్షం కారణంగా ఆలయం చుట్టూ నిర్వహించాల్సిన స్వామి వారల పల్లకి సేవల ప్రదక్షిణాలు రద్దు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 66 లక్షలు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించగా 66,02,828 రూపాయల ఆదాయం లభించింది. గత డిసెంబరు 30 నుంచి మార్చి 21 వరకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించారు. 59 గ్రాముల మిశ్రమ బంగారం, 8 కిలోల 400 గ్రాముల మిశ్రమ వెండి, 37 విదేశీ నోట్లు లభించాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 10 నుంచి 19 వరకు రూ 53,48,030 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ 23,28,707, ప్రసాదాల విక్రయం ద్వారా రూ 23,92,835 లభించగా అన్నదానం కోసం దాతలు రూ 6,26,488 విరాళాలు అందించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటిన ట్రినిటీ విద్యార్థులు


ఇందూజ


హర్షిత


సహజ

పెద్దపల్లి కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటారు. శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన సెమిస్టర్ 1, 3, 5 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ ను కనబర్చిన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు. ఈఫలితాల్లో బీకాం, సైన్స్ విభాగంలో వాసాల ఇందూజ 9.36(బీఎస్సీ), హర్షిత 9.15(బీఎస్సీ), సహజ 9.15(బీకాం), సుమేరు అంజుమ్ 9.1(బీబీఏ), శివరామకృష్ణ 8.9(బీకాం), శిరీష 8.9(బీఎస్సీ), శ్రీవాణి 8.86 (బీఎస్సీ), అభినయ 8.83(బీఎస్సీ), లతీఫా అంజుమ్ 8.81(బీఎస్సీ), తస్వీర్ 8.8(బీఎస్సీ) ప్రతిభ కనబరించారు. ప్రిన్సిపాల్ నీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌చందర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

బాధితురాలిని ఆదుకోవాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట గ్రామానికి చెందిన విలాసాగరం రాజమ్మ ఈనెల 15న ఇంట్లో గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా మంటలు చెలరేగి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం రాజమ్మ సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన రాజమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. గ్యాస్ ప్రమాదంలో గాయపడ్డ రాజమ్మకు గ్యాస్ కంపనీ పరిహారం చెల్లించాలని కోరారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం


సెంటినరీకాలని వాణి సెంటర్ వద్ద అదనపు కలెక్టర్


ఖనిలో పరీక్షా కేంద్రం వద్ద ఏసీపీ రమేష్

రామగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ డి. వేణు తెలిపారు. వాణి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని పేర్కొన్నారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 సెంటర్లను అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 3 సెంటర్లను జిల్లా విద్యాశాఖా అధికారి 6 పరీక్ష కేంద్రాలను సందర్శించారని తెలిపారు. ఎస్ఐ చంద్రకుమార్ పర్యవేక్షణలో పోలీసులు తనిఖీ చేశారు. మండలంలో 294 మంది పరీక్ష రాస్తున్నారు. సెంటినరీకాలనీలోని వాణి పాఠశాల సెంటర్‌లో 229 మంది పరీక్షలకు హాజరయ్యారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని ప్రాంతాలలో 10 కేంద్రాలలో 2500 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను ఏసీపీ మడత రమేష్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు కేంద్రాలకు ఆలస్యం కాకుండా ట్రాఫిక్ విషయంలో చర్యలు తీసుకున్నామని తెలిపారు. సీఐలు ఇంద్రసేనారెడ్డి, కె.రవీందర్ ఉన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ తెలుగు మీడియం, జయ్యారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్ఐ ఆర్ స్వామి, తహసీల్దార్ ముద్దమల్ల జ్యోతిలు సందర్శించారు. బసంత్‌నగర్ కేంద్రంలో 261 మంది విద్యార్థులు జయ్యారంలో 97 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఓదెల మోడల్ స్కూల్‌లో ఓదెలతోపాటు కస్తూర్బా, మోడల్ హైస్కూల్ విద్యార్థులు, కొలనూర్‌లో కొత్తపల్లి, మద్దికుంట, కొలనూర్, పెగడపల్లి విద్యార్థులు, పొత్కపల్లి సెంటర్‌లో గుంపుల, పొత్కపల్లి, కనగర్తి విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 313 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. సుల్తాన్‌పూర్, ఎలిగేడు, ధూళికట్ట ఉన్నత పాఠశాలలకు చెందిన 38మంది బాలురు, 31 మంది బాలికలు పరీక్షలకు హాజరయ్యారు. మాస్ కాపింగ్ అవకాశం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు తొలి రోజు తెలుగు సబ్జెక్టుతో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల సెంటర్‌లో 250 మంది విద్యార్థులకు మొత్తం మంది, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 197 మంది విద్యార్థులకు మొత్తం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను స్క్వాడ్స్ తనిఖీ చేశారు. సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కొలనూరు, ఖని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

రేషన్ వినియోగదారులకు ఉగాది కానుక

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 80 శాతం వరకు సన్న రకం వరి పంటనే రైతులు సాగు చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కూడా 40 శాతం వరకు సన్న రకం వరి పంటనే రైతులు సాగు చే,శారు. జిల్లాలో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని సేకరించారు. డిసెంబర్ నెలాఖరు వరకే కొనుగోళ్లు పూర్తయినప్పటికీ, ఆ వెంటనే మర ఆడించిన బియ్యం పంపిణీ చేయలేదు. అవి కొత్త బియ్యం కావడంతో అన్నం మెత్తగా అవు తుందని జనవరి నెలలో సన్న బియ్యం పంపిణీని నిలిపివేశారు. మూడు మాసాల పాటు బియ్యం మగ్గిన తర్వాత ఉగాది కానుకగా సన్న బియ్యం పంపిణీని ఆరంభిస్తున్నారు. మెజారిటీ వినియోగదారులు తప్పని సరిగా సన్న బియ్యం తీసుకవెళ్లి సద్వినియోగం చేసుకునే అవకాశాలున్నాయి. సన్న బియ్యం పంపిణీతో అక్రమ వ్యాపారులకు అడ్డుకట్ట పడనున్నది.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించండి


రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపాలని, పెద్దంపేట్, కుందన్‌పల్లి, కన్నాల గేట్‌ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను రామగుండం బీజేపీ ఇంచార్జీ కందుల సంధ్యారాణి కోరారు. శుక్రవారం రామగుండం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల పరిశీలనకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం వివిధ పరిశ్రమలు విస్తరించి ఉందని, ఇతర ప్రాంతాలకు ప్రజలు, అధికారులు ప్రయాణిస్తారని పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిచేలా చూడాన్నారు. తిరుపతి, షిర్డికి ప్రత్యేక రైలు సౌకర్యం, రామగుండం నుంచి హైదరాబాద్‌కు ఉదయం 8గంటలకు ఎక్స్‌ప్రెస్ రైలు సౌకర్యం కల్పించాలన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు, అభివృద్ధి కోసం కాంగ్రెస్ నాయకులు జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. రైల్వేస్టేషన్‌లో ప్రతీ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని, ప్రయాణికులు వేచియుండు గది, మరుగుదొడ్లు, కవర్ షెడ్లు ఇరువైపుల మొక్కలు నాటాలని కోరారు. అజ్నీ ప్యాసింజర్ రైలుకు హాల్టిం గ్ ఇవ్వాలని, పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అంబాల కొమురయ్య, కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి రజనీకాంత్, మేకల అనిల్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మంథని అభివృద్ధికి మొండి చేయి

మంథని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో మంథని ప్రజలకు, ఈప్రాంత అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు మొండి చేయి చూపారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ 40 ఏళ్ళుగా ఒకే కుటుంబానికి ప్రజలు అవకాశం కల్పిస్తున్నా ఒక రూపాయి కేటాయించక పోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పిస్తామని 15 నెలలు గడుస్తున్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. రైతులకు సాగునీరు అందించే పోతారం లిఫ్టు గురించి ఊసే ఎత్తక పోవడం విచారకరమన్నారు. ఏడాదిలోగా పూర్తి చేస్తున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పటి వరకు ప్రతిపాదనలు తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు విధానాలతో గోదావరి, మానేరు నదుల తీర ప్రాంతాల్లో పంటలకు నీళ్ళు లేక ఎండిపోతున్నాయన్నారు. ఈనెల 23న కరీం నగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ పర్యటన విజయవంతం పై నియో జకవర్గంలోని పార్టీ ప్రతినిధులతో పుట్ట మధు సమీక్షించారు. జక్కు రాకేష్, ఏగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, గొబ్బూరి వంశీ, కాయితీ సమ్మయ్య, పుప్పాల తిరుపతి, ఆసీఫ్, శ్రీనులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు తప్పులను కప్పి పుచ్చడానికే యాత్ర

కళ్యాణ్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గోదావరి గోస పేరుతో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న యాత్ర కాళేశ్వరం ప్రాజెక్టు తప్పులను కప్పి పుచ్చడానికేనని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మెంటం ఉదయ్‌రాజ్ ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిలో నీరు నిల్వలేకపోవడానికి కారణం మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడం వల్లనేనని, మేడిగడ్డ బ్యారేజీ కోసం కోట్లు వెచ్చించారని, నాణ్యత లేకుండా నిర్మించడం వల్లనే పిల్లర్లు కుంగిపోయాయన్నారు. దీనిపై ఇప్పుడు గోదావరి ఎండిపోయిందంటూ బీఆర్ఎస్ నాయకులు దొంగ పాదయాత్రలు చేస్తున్నారని, తప్పు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం అయితే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరైంది కాదన్నారు. డీపీఆర్ ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ ఎత్తిపోతల ద్వారా రోజుకు 2టీఎంసీల నీటిని ఎత్తిపోస్తామని చెప్పి రోజుకు 3టీఎంసీలు ఎత్తిపోతలు చేపట్టారన్నారు. బీఆర్ఎస్ నాయకులు దొంగ పాదయాత్రలను విడనాడాలని సూచించారు. యూత్‌కాంగ్రెస్ నాయకులు కౌటం సతీష్, నజీమోద్దీన్, రాజ్‌కుమార్, దూళికట్ట సతీష్, దుర్గాప్రసాద్, గౌస్, అల్లి శంకర్, అశోక్, ఎల్లేష్, రోహిత్, చరణ్, స్వరాజ్ పాల్గొన్నారు.

జిల్లాలో కురిసిన అకాలవర్షం


భూపతిపూర్‌లో తాటిచెట్టుపై పడిన పిడుగు

పెద్దపల్లి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం వడగళ్ల వానతో రైతన్నలకు కడగళ్లను మిగిల్చింది. ఉరుములు మెరుపులతో కూడిన రాళ్ల వర్షం కురవడంతో పొట్ట దశలో ఉన్న ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. హన్మంతునిపేట, పెద్దకల్వల, నిట్టూరుతో పాటు పలు గ్రామాల్లో వడగండ్లకు గొలుసు నేల రాలింది. వర్షంతో పాటు వీచిన గాలికి కొన్ని ప్రాంతాల్లో పంటలు నేలకొరిగాయి. పొట్ట దశలో ఉన్న వరి పంటలు చిట్లిపోవడంతో మిగిలేది తాలు మాత్రమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): భూపతిపూర్ చెరువు గట్టుపై ఉన్న తాటి చెట్టుపై శుక్రవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నారాయణపూర్‌తోపాటు పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. పట్టణంతో పాటు పలు గ్రామాలలో పలుచోట్ల వర్షాలు కురిసాయి. ఎక్కువగా ఈదురుగాలులను సుడిగాళ్ల వీయడంతో ప్రజలు వెంటనే ఇళ్లల్లోకి వెళ్లిపోయారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలో భారీ వర్షం కురిసింది. వేడి నుంచి ఉపశమనం పొందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. బంజేరుపల్లి గ్రామంతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో వడగండ్లు పడ్డాయి. మండల కేంద్రంలో గంట పాటు భారీ వర్షం పడడంతో రోడ్లపై నీళ్ల నిలిచి వాహనదారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. భారీగా ఈదురుగాలులు వీస్తూ వర్షం కురిసింది. పొలాలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. విద్యుత్‌సరఫరాలో పలు మార్లు అంతరాయం కల్గింది. అకాల వర్షం కారణంగా పొట్ట దశలో ఉన్న వరి పంటలు, మిర్చి పంటలు దెబ్బ తినే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వాతావరణం చల్లగా మారింది. సాయంత్రం వర్షం కురవడంతో నిన్నటి వరకు ఎండ, ఉక్కపోతతో ఉన్న పారిశ్రామిక ప్రాంతం చల్లగా మారింది.

సామూహిక భగవద్గీత పారాయణాన్ని విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మంథనిలో ఆదివారం నిర్వహించనున్న సామూహిక భగవద్గీత పారాయణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సనాతన ధర్మ ప్రచారం సమితి వ్యవస్థాపకులు మంథెన శ్రీనివాస్ కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలనే లక్ష్యంతో ఐదేళ్ళుగా పనిచేస్తున్నామని, ఇప్పటి వరకు 40వేల మందికి భగవద్గీత అందజేశామన్నారు. మంథనిలో ఐదు వేల మందితో భగవద్గీత పారాయణాన్ని నిర్వహిస్తున్నామని సత్సంగ్‌లు, 10 మంది సాధువులు హాజరు కానున్నట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. విక్రమసింహారావు, కృష్ణమూర్తి, అశోక్‌కుమార్, బాలయ్య, రాజు, శశి, మారెపల్లి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

సుల్తానాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ప్రశాంతత చేకూరుతుందని విశ్వకాంతి జగత్ వ్యవస్థాపకులు ఆస్ట్రల్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య భవన్‌లో ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యానం ద్వారా కోపతాపాలు తగ్గి ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. శ్రీకాంత్ సునీత దంపతులను సన్మానించారు.

ఖని నుంచి భద్రాద్రి రాముడికి తలంబ్రాలు


తలంబ్రాల కోసం వడ్లను వలుస్తున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శివాలయం నుంచి భద్రాద్రి రాముడికి తలంబ్రాలు సమర్పించనున్నట్టు శివాలయ అధ్యక్షుడు మంచికట్ల బిక్షపతి చెప్పారు. శుక్రవారం శివాలయంలో 108మంది మహిళలుతో వడ్లను ఒలిచి తలంబ్రాలను శనివారం భద్రాచలం రామాలయంలో అప్పగించనున్నట్టు చెప్పారు. మహిళలు, వీహెచ్‌పీ సంయోజక్ అన్నపూర్ణ, నాయకులు బండారి రాయమల్లు, తాటిపాముల రాజేష్, రాజిరెడ్డి, మల్లయ్య, కొమురయ్య, నారాయణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ


భూమి పూజ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

రామగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): లద్నాపూర్ పునరావాస కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం అదనపు కలెక్టర్ వేణు భూమి పూజ చేశారు. ఓసిపి-2 ప్రాజెక్టు విస్తరణలో లద్నాపూర్ గ్రామస్తులకు రత్నాపూర్‌లో కేటాయించిన ప్లాట్సలలో రూ.2.66 లక్షలతో వీహెచ్‌సీ, రెండు అంగన్వాడి కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీహాల్, రామాలయం, వినాయక మండపాలకు భూమి పూజ చేపట్టారు. నిర్వాసిత గ్రామాల్లో పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో శైలజారాణి, సింగరేణి అధికారులు రఘుపతి, అయిలయ్య, రాజేంద్రకుమార్, సుదర్శనం, కోల శ్రీనివాస్, పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కోల్‌సిటీటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 ఆధ్వర్యంలో గోదావరిఖని పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్జీ-1 అధికార ప్రతినిధి డి.కిరణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ టెక్ మహీంద్రా స్కిల్ బిల్డింగ్ ప్రోగ్రాం, ఉచిత శిక్షణ ఉద్యోగ నియామకం ద్వారా మూడు నెలల శిక్షణ ఉపాధి అవకాశానికి దరఖాస్తులు చేసుకోవాలని, ఈనెల 31వ తేదీలోగా 18-28 వయస్సు ఉన్న అభ్యర్థులు పది, ఇంటర్,డిగ్రీ పూర్తి చేసిన వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఎంపిక చేసిన కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్‌లో శిక్షణకు పంపిస్తామని, మూడు నెలల శిక్షణ పొందిన వారికి వారి హాస్పిటల్, ఇతర అనుబంధ సంస్థలలో ఇన్నోవేషన్ హెల్త్ రీసెర్చ్ సర్టిఫికేషన్‌తో హెల్త్‌కేర్ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

కొత్త నాయకత్వానికి యువత నాంది పలకాలి


యువపార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యువత కొత్త నాయకత్వానికి నాంది పలకాలని సింగరేణి ఆర్జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్- 2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం నాలుగవ శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థ ప్రజల్ని పేదరికం నుంచి బయటపడేస్తుందని, రైతులు ఆహార కొరత ఏర్పడకుండా ఆర్థిక రంగానికి వెన్నుదన్నుగా నిలబడుతున్నారని కొనియాడారు. యువపార్లమెంట్ కార్యక్రమాల ద్వారా యువత నాయకులుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ యువ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించుకునే అవకాశం కల్పించినందుకు శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్, నెహ్రూ యువ కేంద్రం ఆఫీసర్ మద్దుల వెంకట రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి రోజు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన 75 మంది అభ్యర్థులు హాజరై వన్‌నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్‌పై మూడు నిమిషాలకు మించకుండా ప్రసంగించారు. ఇందుకుగాను 100 మార్కులకు పాయింట్లు వేశామని నోడల్ అధికారి ఎ సాంబశివ రావు తెలిపారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ శారద, డాక్టర్ తిరుపతి, డాక్టర్ పి.శంకరయ్య, శ్రీదేవి, టీఎస్‌కే సీ మెంటర్ పి.ఉషారాణి, డాక్టర్ సురేష్, డాక్టర్ స్రవంతి, ఎస్.సమత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ కెడెట్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సీ వర్గీకరణను హర్షిస్తూ సంబరాలు


సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్‌సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ శుక్రవారం కాంగ్రెస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు తాళ్లపల్లి యుగంధర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్‌సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చారిత్రాత్మకమని, ఎస్‌సీ వర్గీకరణ కోసం కొందరు ప్రాణత్యాగాలు చేశారని, ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందిందన్నారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, మాదరబోయిన రవి కుమార్, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని, పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ శ్రమఫలంతో ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. శుక్రవారం మందకృష్ణ చిత్రపటంతో మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణాసంచా పేల్చి మందకృష్ణమాదిగ చిత్రప టానికి క్షీరాభిషే కం చేసి స్వీట్లు పంచుకు న్నారు. అంబాల రాజేం దర్ మాట్లాడుతూ 30సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ అలుపెరు గని పోరాటం చేశాడని, ఎలాంటి పదవులకు ఆశపడకుండా వర్గీకరణ ధ్యేయంగా పనిచేసి ప్రభుత్వాలను ఒప్పించి వర్గీకరణ సాధించా రన్నారు. మాజీ జడ్పీటీసీలు వంగల తిరుపతి రెడ్డి, గంట రాములుయాదవ్, అక్కపాక తిరుపతి, తుల మనోహర్‌రావు, తూండ్ల రాజయ్య, జూపాక ఉమామహేశ్వర్, పాల రాజేశం, సబ్బని రాజమల్లు, రానవేణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరిఖనిలో గంజాయి పట్టివేత?

కోల్‌సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి సమీపంలోని ఫైర్ స్టేషన్ పరిసరాల్లో పోలీసులు శుక్రవారం గంజాయి పట్టుకున్నట్టు తెలుస్తున్నది. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి మైనర్లకు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు నిఘా పెట్టినట్టు సమాచారం. ఒక వ్యక్తిని పట్టుకుని పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. గతంలో ఆంధ్ర సీలేరు నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగగా ఇప్పుడు మహారాష్ట్ర నుంచి రైలు మార్గాల ద్వారా తీసుకువచ్చి గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో ప్రమేయం ఉన్న మరికొందరి గురించి పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.

వన్‌టౌన్ సీఐని సస్పెండ్ చేయాలి

కోల్‌సిటీటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాధితుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న గోదావరిఖని వన్‌టౌన్ సీఐని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయాలని సీఐ దృష్టికి తీసుకు వెళితే సమస్యను పరిష్కరించకుండా దూషిస్తూ స్టేషన్‌కు వచ్చే బాధితులను మరింత బాధపెడుతున్నారని పేర్కొన్నారు. బాధితులకు పక్షాన ఉండాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. సీపీ, ఏసీపీలు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, మాతంగి సాగర్, దనాల ఉదయ్, రాహుల్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ముత్తారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పెద్ది లక్ష్మీరాజం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొన్నారు. ట్రాక్టర్‌ను, పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తే చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ గోపతి నరేష్ అన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

మంథనిరూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంజపడుగు గ్రామానికి చెందిన అవిడపు రాజేశంకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు రూ.50 వేల ఎల్‌వోసీని శుక్రవారం మంజూరు చేయించారు. రాజేశం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

తాగునీటి కోసం అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం


అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

మంథనిరూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎక్లాస్‌పూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీటి కోసం గ్రామస్థులు శుక్రవారం అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ గేట్ వాల్‌లో అధికారులు మట్టి నింపడంతో తాగునీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్థులు వాపోయారు. గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, డీఈ కిరణ్, ఇంట్రా డీఈ రాజ్‌కుమార్‌లు గ్రామానికి వెళ్ళగా నీరు దొరకక ఒక వైపు ఇబ్బంది పడుతుంటే గేట్ వాల్ మట్టిపోయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులను వెంట బెట్టుకొని గ్రామంలో పలు వార్డుల్లో ఉన్న మంచినీటి సరఫరాను గ్రామస్థులు పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ.. గ్రామస్థులు పరిమితికి మంచి మంచినీటిని వాడుతున్నారని, దీని వలన దిగువ ఉన్న ప్రజలకు మంచినీటి సరఫరా కావడం లేదన్నారు. గ్రామానికి 1.20 లక్షల నీటిని అందిస్తున్నామని తెలిపారు.

అక్రమ దందాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

ముత్తారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలో అక్రమ దందాలను ప్రోత్సహిస్తున్న మాఫియా పై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామస్తులు ఇండ్ల కోసం మట్టిని ఇసుకను తీసుకొంటుండగా దానిని అక్రమ దందాల పేరుతో కొందరు చిత్రీకరిస్తున్నారని అధికార పార్టీకి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. అక్రమ దందాలు చేసిన వారిని అధికారులు చట్టపరంగా శిక్షిస్తారని, అధికార పార్టీపై బురదజల్లే కార్యక్రమం చేస్తే కోరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

కార్మిక సంఘ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సుల్తానాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్మిక విభాగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పోలీసులు ముందస్తుగా పలువురు కార్మిక సంఘం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పలు విభాగాల్లో పని చేస్తున్న కార్మికులను ముందస్తు అరెస్టు చేయడంపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు తీవ్రంగా ఖండించారు.